క్లుప్తంగా

100 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 100 మందిని వైద్యులు పరీక్షించిన వైద్యులు.. వారిలో 40 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. వీరందరికి కర్నూలులో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ అంబటి ఫణిరాజ్ గుప్తా, సంఘం నాయకులు సుకుమార్, రాధాకృష్ణ, జయరాం, క్యాంప్ చైర్మన్ డాక్టర్ బీవీ సుబ్బారావు, చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, శీలా నాగేంద్ర, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా


కలవల రాంకుమార్

ధర్మవరం: తాను వైఎఎస్సార్‌సీపీలోనే ఉన్నానని.. ఏ పార్టీలోకి వెళ్లడం లేదని పట్టణంలో కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేయడం ఎంతో బాధ కల్గించిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు కలవల రాం కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆర్యవైశ్య సంఘం నాయకులు నారా లోకేష్‌ను పాదయాత్రలో కలవడం జరిగిందన్నారు. అయితే తాను టీడీపీలోకి వెళ్లడం లేదన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అభిమానిస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

హనుమద్ వాహనంపై లక్ష్మీచెన్నకేశవుడు


చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలో పూరతన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిని హనుమద్ వాహనంపై ఊరేగించారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలతో అలంకరించిన ఉత్సవ పల్లకీల్లో చెన్నకేశవస్వామికి పూజలు చేసి, కొలువుదీర్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నీటి సమస్య పరిష్కారం


మోటార్ అమర్చుతున్న దృశ్యం

నల్లచెరువు: మండల పరిధిలోని పులిమివాండ్ల పల్లిలో పంచాయతీకి సంబంధించిన బోరు బావిలో 15 రోజుల క్రితం మోటారు, పైపులు పడిపోయాయి. మోటార్ పని చేయక పోవడంలో గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పంచరత్నమ్మ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయించారు. గ్రామస్తుల ద్వారా సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆదివారం కొత్త మోటారు, పైపులు ఏర్పాటు చేయించి, నీటి సమస్యను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోరంట్ల: స్థానిక ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్ సమీపంలో కదిరి–హిందూపురం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరంట్లకు చెందిన చంద్రప్ప గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. చంద్రప్ప మరో వ్యక్తితో కలసి ద్విచక్ర వాహనంలో గుమ్మయ్యగారిపల్లి నుంచి గోరంట్ల వైపు వెళ్తున్నారు. అయితే గోరంట్ల వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో వెనుక వైపు కూర్చున్న చంద్రప్ప గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హిందూపురం తరలించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని వాణి వీధిలో మార్చి 29వ తేదీన భార్య ఆత్మహత్య కేసులో నిందితుడు ఆంజనేయులును కదిరి డీఎస్పీ భవ్యకిషోర్ ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. తనకల్లు మండలం రాశినేపల్లి వద్ద బండకడపల్లికి చెందిన ఆంజనేయులుకు నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన వెంకటరమణ కుమార్తె వనజతో మూడు నెలల క్రితం వివాహమైంది. వీరు కదిరిలోని వాణి స్ట్రీట్‌లో కాపురం ఉంటున్నారు. ఆంజనేయులు కట్నం తేవాలంటూ భార్య వనజను రోజూ వేధించేవాడు. దీంతో అసహనానికి గురైన వనజ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరకట్నం వేధింపులు తాళలేక వనజ ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఆంజనేయులును కదిరి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈపూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేగాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

నాటి అమరావతే నేటి ‘అమడగూరు’

- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చౌడేశ్వరమ్మ
- 6 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు


అమడగూరులో ఉన్న చౌడేశ్వరీ దేవి ఆలయం


చౌడేశ్వరీ మూలవిరాట్

అమడగూరు: పూర్వం 800 సంవత్సరాల క్రితం అమరావతి పట్టణంగా పిలుస్తున్న ప్రాంతాన్నే నేడు అమడగూరుగా పిలుస్తున్నట్లు పూర్వీకుల కథనంగా ఉంది. ఈ అమడగూరులో నిర్మితమైన చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు రోజురోజుకూ ప్రాచుర్యం సంతరించుకుంటూ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఏటా చైత్రమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అమడగూరు, చీకిరేవులపల్లి, గుండువారిపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు ఈ ఆలయంలో చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలను 8 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

ఉత్సవాల వివరాలు

ఏటా చైత్రమాసంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారిని 16 గ్రామాల్లోకి ఊరేగింపుకు తీసుకెళ్తారు. తర్వాత వచ్చే పున్నమితో ఎప్పటిలాగానే సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది కూడా ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా ఈ ఉత్సవాల్లో శ్రీజ్యోతి ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉండగా ఆ రోజు ఎంతో మంది అమ్మవారిని దర్శించుకుని పునీతులవుతారు. ఉత్సవాల సందర్భంగా హరికథలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6న కుంభకూడు, 7న ఉయ్యాలసేవ, 8న సూర్యప్రభ, 9న చంద్రప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు, 10న శ్రీజ్యోతి, 11న అశ్వవాహనంపై అమ్మవారి ఊరేగింపు, 12న సింహ వాహనంపై అమ్మవారి ఊరేగింపు, 13న హంస వాహనంపై అమ్మవారిని ఊరేగిస్తారు.

రూ.కోటితో ఆలయ అభివృద్ధి..

పురాతన కాలం నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోగా కర్ణాటక ప్రాంతం బెంగళూరుకు చెందిన ఎమ్మెల్యే సోదరులు కిష్టప్ప, శ్రీనివాసులు తమ బంధువులతో కలిసి సుమారు రూ.కోటి నిధులతో మూడు గోపురాలు, ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ఆలయం పేరిట కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఇటీవల మరో రూ.పది లక్షలు వెచ్చించి భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ రేకుల షెడ్లు నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆలయ ప్రాంగణంలో ఏటా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో మొరుసు కాపు జాతికి చెందిన వారు ప్రతి ఆదివారం పేరుదేవర్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

గంగిరెడ్డిపల్లిలో అమ్మవారి ఊరేగింపు..

గ్రామాల ఊరేగింపులో భాగంగా ఆదివారం గంగిరెడ్డిపల్లిలో గ్రామస్తులు చౌడేశ్వరీ అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అమ్మవారిని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గతంలో మొక్కులు చేసుకున్న వారు అమ్మవారికి వడివేలును సమర్పించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున ఉన్న రామాలయం వద్ద అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. నేడు చీకిరేవులపల్లిలో అమ్మవారిని ఊరేగించనున్నారు.

ఇదీ ఆలయ చరిత్ర..

క్రీస్తుపూర్వం 800 వందల సంవత్సరాల క్రితం శ్రీరంగరాజు పాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తూ ప్రాంత ప్రజలంతా సుఖ సంతోషాలతో గడిపేవారు. అయితే ప్రజానీకాన్ని తన సొంతబిడ్డల్లా చూసుకొంటున్న రాజుకు తనకంటూ సంతానం లేక బాధపడ్డారు. ఒకరోజు రాత్రి కలలో రాజుకు చౌడేశ్వరీ అమ్మవారు కనిపించి గ్రామానికి రెండు వైపులా రెండు చెరువులను తవ్వించి గ్రామంలో తన పేరిట ఆలయాన్ని నిర్మిస్తే సంతానం కలుగుతారని చెప్పినట్లు సమాచారం. అమ్మవారు చెప్పినట్లుగా రాజు గ్రామానికి రెండు వైపులా చెరువులను తవ్వించి ఆలయాన్ని నిర్మించగా సంతానం కలిగింది. అప్పుడు తవ్వించిన చెరువులే నేడు పెద్దచెరువు, దేవగుడి చెరువుగా పిలవబడుతున్నాయి. శ్రీరంగరాజు నిర్మించిన ఆలయంలోని అమ్మవారి దర్శనానికి కర్ణాటక నుంచి చాలా మంది భక్తులు వస్తారు. కర్ణాటక ప్రాంతంలో ఎక్కువగా ఉన్న మొరుసు కాపు జాతికి చెందిన వారు ఎక్కువగా పూజలు నిర్వహిస్తుండగా ఆ జాతికి చెందిన ఒక స్త్రీ ఆలయంలో శిలగా మారి అమడగూరమ్మగా పిలవబడుతున్నట్లు కథనంగా ఉంది.

నేడు కుంభాభిషేకం

నల్లచెరువు: మండల కేంద్రంలోని యోగి వేమన ఆలయంలో సోమవారం కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మట్టల ఆరాధన


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లిలో కింగ్స్ చర్చి ఫాదర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆరాధన నిర్వహించారు. మెదటగా కింగ్స్ చర్చిలో ఏసుక్రీస్తు పాటలను ఆలపిస్తూ పాటలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలతో యేసు గీతాలను ఆలపిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రార్థనలు చేశారు. మట్టల ఆదివారం ప్రాధాన్యతను వివరించారు.

నేడు ‘స్పందన’

కనగానపల్లి/బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్లు పీవీ రమణ, యుగేశ్వరిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక ఎంపీడీఓ కార్యాలయం, మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి అన్నారు. ఆదివారం పుట్టపర్తి నగరపంచాయతీ పరిధిలోని 10, 11 వార్డుల్లో ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు నాయుడు పొదుపు మహిళలకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98.6 శాతం నెరవేర్చారన్నారు. సచివాలయాల మున్సిపల్ కన్వీనర్ సూర్యాగౌడ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో పొదుపు మహిళలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, వైస్ చైర్మన్ మాతంగి, తిప్పన్న, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, మెప్మా సీఎంఎం రామాదేవి, 11 వార్డు కౌన్సిలర్ ఈశ్వరమ్మ, 10 వార్డు ఇన్‌చార్జ్ కవిత, సీఓ ఆదినారాయణ, నాయకులు నాగభూషణ రాజు, శంకర్, శివప్ప, వెంకటేశ్, మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య

పుట్టపర్తి టౌన్: ప్రధాని మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలనాపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సాయి ఆరామం అతిథి గృహంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందన్నారు. రూ.లక్షల కోట్లు ఎగ్గొడుతున్న బడా బాబులకు మోదీ అండగా నిలుస్తున్నారని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు పెరిగిపోయాయన్నారు. మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఈనెల 14 నుంచి 30 వరకూ సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపడతామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య, అనుబంధ సంస్థల నాయకులు సురేంద్ర, జింకా చలపతి, బయన్న, నియోజవర్గం కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

10 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తచెరువు: సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు కొత్తచెరువులో మూడు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాలుర, బాలికల జెడ్పీ పాఠశాలల్లో ఒక్కొక్క సెంటర్‌కు 245 మంది విద్యార్థులు, శ్రీవిద్యలో 220 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొత్తం 33 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

కొత్తచెరువు/ఓడీ చెరువు: 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐలు లింగన్న, గోపి తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల 100 మీటర్ల పరిధిలో మొబైల్ ఫోన్లు నిషేధించడం జరిగిందన్నారు. చీఫ్ ఎగ్జామినర్ మాత్రమే మొబైల్ యాక్సెస్ కలిగి ఉంటారన్నారు. పరీక్షల సమయంలో అన్ని జిరాక్స్ సెంటర్లు రోజూ మధ్యాహ్నం వరకూ బంద్ చేయాలని ఆదేశించారు.

మూడు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నల్లమాడ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, కస్తూరిబా, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 638 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ వలీబాషా తెలిపారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ తిరుపాల్ నాయక్ తెలిపారు. 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తగరతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, మోడల్ స్కూల్లోని పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 372 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు. రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిలో జెడ్పీ స్కూల్లో 110 మంది, మోడల్ స్కూల్లో 262 మంది విద్యార్థులకు పరీక్షలు రాస్తున్నారన్నారు.

గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు


పోట్లమర్రిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలను ఊరేగించారు. గుమ్మల్లకుంటలో బైరవుడు, జలాలపురంలో పోతులయ్య, పోట్లమర్రిలో నలలమ్మ తల్లిని పూలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నం, పూలను తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజల అనంతరం గ్రామస్తులు మూగజీవాలను బలి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఏటా ఉగాది, శ్రీరామనవమి పండుగ మరుసటి దినం గ్రామ దేవతలకు బోనాలు తీసుకువచ్చి జంతుబలులు ఇవ్వడం ఆచారంగా కొనసాగుతోందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో టెంకాయలు, చీనీపండ్లు విసిరే పందేలు ఆడారు.

తలుపుల: మండలంలోని సిద్దుగూరిపల్లి గ్రామంలో బోసు ముత్తాత స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని సత్యమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాల గంపలు ఎత్తుకొని బోద్రాతమ్మలకు నీరుపోసి పూజలు చేశారు.

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి చిత్రావతి నది ఒడ్డున వెలసిన గంగమ్మకు ఆదివారం మహిలలు జ్యోతులు, బోనాలు ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాలనీ వాసులు జ్యోతులతో ఊరేగింపు చేపట్టారు.


పుట్టపర్తి అర్బన్: జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం


తలుపుల: సిద్దుగూరిపల్లిలో బోనాల సందడి

ప్రాణం ఉన్నంత వరకూ ప్రజాసేవ చేస్తా


మహిళలకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


ఆసరా సంబరాలకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

- పేదల కళ్లల్లో ఆనందమే జగనన్న లక్ష్యం
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: రేయ్ పప్పూ.. నీకిదే హెచ్చరిక. నిజాయతీగా ఉన్న వాడి జోలికి దయచేసి రావొద్దండి.. నిజాయతీగా ఉండే వాడికి పొగరుతోపాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఎక్కువ.. నేను తప్పు చేసేవాడినైతే ఎవరికైనా లొంగాలి.. నా కట్టె కాలేదాకా నేను తప్పు చేయను.. ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలకు సేవ చేస్తా’ అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ‘వైఎస్సార్ ఆసరా’ సభను ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. మండలంలో 9,271 సభ్యులకు మంజూరైన రూ. 8.95 కోట్ల ఆసరా చెక్కును ఎమ్మెల్యే అందించారు. ముందుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నా సొంత డబ్బుతో రైతులకు ఉచితంగా బోర్లు వేయించా.. దాదాపు 15 వేల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పించా, 2 వేల మందికి గొర్రెలు పంపిణీ చేశానని తెలిపారు. జలజీవన్ మిషన్ మిషన్ కింద చెన్నేకొత్తపల్లి మండలానికి రూ.30 కోట్లు నిధులు మంజూరయ్యాయని, మండల వ్యాప్తంగా ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు.

25 ఏళ్లలో చేయలేని అభివృద్ధి చేశా...

నియోజకవర్గంలో పరిటాల కుటుంబం 25 ఏళ్లలో చేయలేని అభివృద్ధి పనులను నాలుగేళ్లలో చేశానని, మీ ఎమ్మెల్యేగా, మీ అన్నగా, తమ్ముడిగా గర్వంగా చెప్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ హయాంలో వారు చేసిన అభివృద్ధేమీలేదని, ఒకవేళ ప్రభుత్వం ఏదైనా అంతో ఇంతో చేసినా పరిటాల కుటుంబం చేసిందని గొప్పలు చెప్పుకుంటారన్నారు. తోపుదుర్తి కుటుంబం, దాతల సహకారంతో రూ.15 కోట్లు వెచ్చించి, లక్ష లీటర్ల పాలు సేకరణే లక్ష్యంగా డెయిరీ నిర్మించామన్నారు. ఇందులో సభ్యత్వం పొందిన పాడిమహిళా రైతులందరికీ హక్కు ఉంటుందన్నారు.

రోజుకు రూ.2 కోట్లు తిన్న చంద్రబాబు..

రాష్ట్రంలో 1995 వరకు ప్రభుత్వ సహకార డెయిరీ ఉండేదని, ఇందులో పాడి రైతులే భాగస్వాములని, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సహకారం డెయిరీలన్నీ మూసేసి, హెరిటేజ్ డెయిరీని తీసుకొచ్చారని ఎమ్మెల్యే విమర్శించారు. 2019 వరకు పాల మద్దతు ధర హెరిటేజ్ సూచించిన ధర ఇచ్చేవారన్నారు. లీటరుకు రూ.20 లోపే ఇచ్చేవారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అముల్ డెయిరీని తీసుకొచ్చారన్నారు. ఇది వచ్చిన తర్వాత లీటరుకు రూ. 28 నుంచి రూ.32 దాకా తీసుకొచ్చారన్నారు. అంటే రూ.12 దాకా అదనంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఎంపీడీఓ అశోక్‌నాయక్, ఏపీఎం రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవింద రెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రా రెడ్డి, వైస్ ఎంపీపీ గాయిత్రి, ఎంపీటీసీలు రాములమ్మ, జ్యోతి, సర్పంచులు ధనశ్రీ, కృష్ణారెడ్డి, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, ప్యాదిండి నరసింహారెడ్డి, సింగం హనుమంతరెడ్డి, బొగ్గు కిష్ట, హరినాథరెడ్డి, మనేరు నరసింహులు, చిన్నా పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ‘జగనన్నే మా భవిష్యత్తు’ను విజయవంతం చేయండి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఈనెల 7వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో నియోజక వర్గంలోని సచివాలయ కన్వీనర్లు, పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ వివరించాలన్నారు. ప్రతి మండలంలోనూ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు కన్వీనర్లు కలిసి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ప్రతి గడపనూ సందర్శించేలా సన్నద్ధం చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లాలన్నారు. ఎన్నికల సమీపిస్తుండటంతో ఎవరి మనసునూ నొప్పించకుండా గుర్తింపునివ్వాలన్నారు. సోషల్ మీడియాలో జగనన్నే మా భవిష్యత్తుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

తొడలు కొట్టాల్సిన పని లేదు

మనమంతా ప్రజా సేవకులం. ఎవరూ తొడలు కొట్టాల్సిన పని లేదు, మీసాలు తిప్పాల్సిన పని లేదని సూచించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొడితే ఎలా ఉంటుందో శనివారం జరిగిన సంఘటనే ఉదాహరణ అన్నారు. ఇవన్నీ మన మంచికే జరుగుతున్నాయని తెలిపారు. ఇది ఇప్పటితో ఆగదన్నారు. లోకేష్ ఒక సన్యాసి తెలివి తక్కువ మాలోకం గురించి మాట్లాడటం వృథా అన్నారు. మన నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రతి గ్రామంలోనూ ప్రతి రచ్చ కట్ట వద్ద డిబేట్ పెట్టి, అభివృద్ధిపై వివరించాలని సూచించారు. నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిని మీ సెల్‌ఫోన్, కరపత్రం ద్వారా వివరంగా తెలియజేద్దామన్నారు. పుట్టపర్తి అభివృద్ధి కోసం మొదట శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుతోనే ప్రారంభించాలన్నారు. మంచి మాటలు చెబుతూనే ప్రజల మనసును గెలుచుకోవాలన్నారు. కుల మతాలు, పార్టీలను చూడకుండా ప్రతి కుటుంబానికీ సహాయం చేశామన్నారు. జగనన్నను ఆదరించండి.. శ్రీధరన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీని సాధిద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీలు ఏవీ రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిప్పన్న, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేశప్ప, పుట్టపర్తి అర్బన్, రూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీసీ, అమడగూరు సచివాలయ కన్వీనర్లు సూర్యగౌడ్, మల్లికార్జున, సాంబశివారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గంగిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, సుధాకరరెడ్డి, కుళ్లాయి నాయక్, రాజునాయుడు, మున్సిపల్ విప్ సాయి గీత, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, నాయకులు నారాయణరెడ్డి, కవిత, తదితరులు పాల్గొన్నారు.